
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శుక్రవారం, 28 జూన్ 2024

5





అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద ట్రయల్‌రన్ అనంతరం కృతజ్ఞతతో వందనం చేస్తున్న మంత్రి తుమ్మల

జయహో 'సీతారామ'

బీజీ కొత్తూరు వద్ద ట్రయల్‌రన్ విజయవంతం

- పంప్‌హౌస్ నుంచి ప్రధాన కాల్వలోకి దూకిన గోదావరి జలాలు
- తిలకించి పులకించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎట్టకేలకు ఫలిస్తున్న భగీరథ ప్రయత్నం
- ఈ ఏడాది ఖరీఫ్‌కే సాగర్ ఆయకట్టుకు అందనున్న గోదావరి జలాలు
- వడివడిగా సాగుతున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులు
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు
- అంచనా వ్యయం రూ.13,500కోట్లు.. ఆయకట్టు 10లక్షల ఎకరాలు... 6

చెంతనే గోదావరి ఉన్నా... సాగునీటి చింతలు ఎదుర్కొంటున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కొత్త కళ రాబోతోంది. ఎన్నాళ్లుగానో రైతులు పెట్టుకున్న ఆశలు ఎట్టకేలకు నెరవేరబోతున్నాయి. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల పంటపొలాలు సస్యశ్యామలం కాబోతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలించబోతోంది. సీతారామ సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీ) నుంచి ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి నీరు వదిలేందుకు వడివడిగా పనులు సాగుతున్నాయి. ఈ మేరకు అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వద్ద గురువారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. మంత్రి తుమ్మల సమక్షంలో నీటిపారుదలశాఖ అధికారులు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. బీజీ కొత్తూరు వద్ద సీతారామ మొదటి లిఫ్టు పంప్‌హౌస్ నుంచి నీటిపారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, సీతారామ లిఫ్టు ఇరిగేషన్ సీఈ శ్రీనివాస రెడ్డి ఆరు మోటర్లలో ఒక మోటర్‌ను స్విచాన్ చేయడంతో గ్రావిటీ కాలువ ద్వారా వచ్చిన జలాలు పంపుహౌస్ నుంచి ప్రధాన కాలువలోకి పరవళ్లు తొక్కాయి. ఆ వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను అభినందించి పుడమితల్లికి, గోదావరి జలాలకు, సీతారామచంద్రస్వామికి నమస్కరించారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం/అశ్వాపురం

నా ఆకాంక్ష నెరవేరబోతోంది : మంత్రి తుమ్మల 6



కొత్తగూడెం సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



రైతు రుణమాఫీ చేసి చూపిస్తాం

ఆగస్టు కంటే ముందే ప్రక్రియ పూర్తిచేస్తాం

- సీతారామ ప్రాజెక్టు నుంచి ఉమ్మడి జిల్లాకు సాగునీరు
- కొత్తగూడెం బహిరంగసభలో డిప్యూటీ సీఎం భట్టి
- జిల్లాలో ఆయిల్‌పామ్‌ను మరింత విస్తరిస్తాం : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అన్నివర్గాల ప్రజలకు ఆరు గ్యారెంటీ స్కీం : రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రహదారుల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తాం : ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

కొత్తగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రైతురుణమాఫీ చేసి తీరుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ఆగస్టు కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కులతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరావు, కోమటరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా రూ.2లక్షల రుణాలను అమలు చేసి చూపిస్తామ న్నారు. రైతు భరోసా అమలుపై ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోందని, దీనిపై అసెంబ్లీ చర్చించి త్వరలోనే అమలు చేస్తామన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి రూ.42వేల కోట్లు అప్పు తెచ్చి మిషన్‌భగీరథ పథకాన్ని చేపట్టినా ఇంటింటికి తాగునీరు ఇవ్వలేకపోయారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ (మిగతా 6వ పేజీలో)



గూడెంలో డ్రైనేజీల నిర్మాణ పనుల కోసం శంకుస్థాపన దృశ్యం

కొత్తగూడేనికి ప్రగతి కళ

రూ. 130 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు

కొత్తగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో గురువారం రూ.130 కోట్లతో తాగునీరు, రహదారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివారెడ్డి, కోమటరెడ్డి వెంకటరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇంటింటికి తాగునీరు అందించేందుకు అమృతపథకం కింద రూ.125కోట్లతో తాగునీటి పథకానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. చుంచుపల్లి పరిధిలోని బైపాస్ రోడ్డు నుంచి పోస్టాఫీస్ సెంటరు వరకు రూ.4కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో డ్రైనేజీలకు ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మిషన్‌భగీరథ పేరుతో రూ.42వేల కోట్లు తెచ్చి ఖర్చు చేసినా ఇంటింటికి తాగునీరు రాలేదన్నారు. ఆ నీరు వస్తే కొత్తగూడెం పట్టణంలో రూ.130కోట్లు ఖర్చుచేయాల్సిన అవసరం ఏంటన్నారు. కొత్తగూడెం పట్టణంలో ఐటీ హబ్, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు కలుపుతూ మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రితో మాట్లాడి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంకా ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో 'పద్మశ్రీ' సకిని రామచంద్రయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అండగా ఉంటాం..

- కొత్తగూడెంలో నివేశన స్థలం అందజేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కూనవరంలో 'సకిని' కుటుంబసభ్యులకు పరామర్శ

మణుగూరు, జూన్ 27: 'పెద్దమ్మా ధైర్యంగా ఉండు... ప్రభుత్వం ఉంది.. నేను ఉన్నా.. మీ కుటుంబాన్ని ఆదుకుంటాం.. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చేందుకు కృషి చేస్తా' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దివంగత పద్మశ్రీ సకిని రామచంద్రయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలంలో గురువారం పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూనవరం గ్రామంలోని రామచంద్రయ్య ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య కుమారుడు బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదని కన్నీటి పర్యంతమయ్యాడు. సకిని కుటుంబసభ్యుల ఆవేదన విన్న తర్వాత మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రామచంద్రయ్య భార్యకు పెన్షన్ శాశ్వతంగా ఇచ్చేలా తగిన ఏర్పాట్లు చేయిస్తానన్నారు. రామచంద్రయ్య కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది..

పద్మశ్రీ గ్రహీత సకిని రామచంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన తరువాత మంత్రి పొంగులేటి విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పద్మశ్రీ వచ్చిన తర్వాత నాటి ప్రభుత్వం కళాకారుడు మొగిలయ్య, రామచంద్రయ్యను ఆదుకుంటామని ప్రకటించిందని కానీ మొగిలయ్యకు ఇంటి స్థలం పారితోషకాలు ఇచ్చి రామచంద్రయ్యకు మాత్రం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఆయన కుటుంబానికి కొత్తగూడెంలో 462 చదరపు గజాల ఇంటిస్థలాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 12వ రోజు కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వారి సతీమణికి భూమి డాక్యుమెంట్ కాపీలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ మల్లన్న, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు యడవల్లి కృష్ణ, హౌసింగ్ బోర్డు చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఆదివాసీ జాతీయ నాయకులు చందా లింగయ్య దొర, లక్ష్మణ్‌రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

పాల్గొననున్న అగ్రనాయకులు.. ఖమ్మంలో ఏర్పాట్లు పూర్తి 6

ఆన్‌లైన్ మనీ స్కామ్ ఆటకట్టు

- ప్రధాన నిందితుడు వీరన్న సహా ముగ్గురి అరెస్టు
- రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్టు ప్రాథమిక అంచనా

నేలకొండపల్లి, జూన్ 27: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి కేంద్రంగా ఆన్‌లైన్ స్కీం పేరుతో జరిగిన స్కాంలో పోలీసులు గురువారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ నెల 23న మానుకొండ రామారావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన భూక్యా వీరన్నపై కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్ఐ తోట నాగరాజు గురువారం రాత్రి తెలిపారు. విచారణ అనంతరం ఈ కేసులో మంగాపురం తండాకు చెందిన భూక్యా వీరన్న, హైదరాబాద్‌లోని దిల్‌షుక్‌నగర్ ప్రాంతంలోని కమలానగర్‌కు చెందిన ఉమ్మనేని రాఘవరావు, కూకట్‌పల్లికి చెందిన కొలగాని రామకోటేశ్వరరావులను అరెస్టు చేసి ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 ప్రకారం 420 ఐపీసీ, సెక్షన్66(డి)ఆఫ్ ఐటీ యాక్ట్ సెక్షన్ ప్రకారం కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



వీరన్న

నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన భూక్యా వీరన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తూ సునాయాసంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో హైదరాబాద్‌కు చెందిన ఉమ్మనేని రాఘవరావు సహాయంతో మనీ సర్క్యులేషన్ స్కీంను ప్రారంభించాడు. ఇందుకు కొలగాని రామకోటేశ్వరరావు అనే సాఫ్ట్‌వేర్ డెవలపర్ తయారుచేసిన వెబ్‌లింకులతో గత సంవత్సరం జూన్, ఈ సంవత్సరం ఫిబ్రవరిలో మోసపూరితమైన మనీ సర్క్యులేషన్ స్కీం మొదలు పెట్టి జూన్ 2024 వరకు ఖమ్మం తదితర జిల్లాల నుంచి



సుమారు 823మంది నుంచి సుమారు రూ.9.58 కోట్లను (ప్రస్తుత దర్యాప్తు ప్రకారం) సేకరించి కొంత మొత్తాన్ని స్కీం ప్రకారం డిపాజిట్‌దారులకు చెల్లించి చివర్లో ఎక్కువ మొత్తంలో చేరిన వారికి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. ఈ వ్యవహారంలో అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను శుక్రవారం కోర్టు ముందు హాజరుపరుస్తామని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ముమ్మరంగా మున్నేరు కరకట్ట పనులు



మున్నేరుకు వరద నివారణ కోసం నిర్మిస్తున్న కరకట్ట పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

- పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు
- నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 27: ఖమ్మం నగరంలోని మున్నేరుకు వచ్చే వరదను నివారించేందుకు.. పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న నష్టాన్ని నివారించే లక్ష్యంతో రెండు వైపులా నిర్మిస్తున్న కరకట్ట పనులను నీటిపారుదలశాఖ క్వాలిటీ కంట్రోల్ వరంగల్ అధికారులు గురువారం పరిశీలించారు. మున్నేరు సమీపంలోని దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాల్లో జరుగుతున్న పనులను ఎస్ఈ దేవేందర్‌రెడ్డి, ఈఈ వెంకట రమణరావు, డీఈ చంద్రబాబుల బృందం నదీ పరివాహక ప్రాంతాల్లో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.690కోట్లతో ఈ పనులను చేపట్టింది. గత రెండు నెలలుగా జరుగుతున్న కరకట్ట పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పోలేపల్లి సమీపంలో రెండు వైపులా 2 కిలోమీటర్ల మేర ఫౌండేషన్ పనులను చేపట్టారు. 30 మీటర్ల వెడల్పుతో పునాది తవ్వి కాంక్రీట్ పనులను చేపట్టారు. ఈ పనులను పరిశీలించి నాణ్యతను అంచనా వేశారు. జరగాల్సిన పనులను ఎలా చేపట్టాలనే విషయాలపై వారు పలు సూచనలు చేశారు. నిర్దేశిత లక్ష్యంలోగా పనులను పూర్తి చేయాలని వారు సీపీఈటీ, పటేల్ ఇంజనీరింగ్ అనే రెండు నిర్మాణ సంస్థల సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పాలేరు డివిజన్ ఈఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, డీఈలు రమేష్‌రెడ్డి, మన్మథరావు, ఏఈలు అరుణ, రమాదేవి, మణిధర్ తదితరులున్నారు.



వైరా కేవీకేకు అవార్డుల పంట 6

విద్యార్థిని దండించిన మహిళా పీఈటీ

- పాఠశాల ఎదుట ధర్నా చేసిన తల్లిదండ్రులు, బంధువులు 6

తప్పతాగి విద్యార్థులను దూషించిన టీచర్

- ఆగ్రహంతో తరగతి గదిలో నిర్బంధించిన తల్లిదండ్రులు
- ఇల్లెందులపాడు పాఠశాలలో ఘటన

గోదావరి వరదల వేళ
అప్రమత్తంగా ఉండాలి..

- ప్రభుత్వం చేసే సహాయం బాధితుల్లో మనోధైర్యాన్ని నింపాలి
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గోదావరి వరదల సహాయక చర్యలపై కొత్తగూడెంలో ముందస్తు సమీక్ష
- పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కొత్తగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గోదవరి వరదల సమయంలో ప్రభుత్వం చేసే ప్రతీ సహాయం ప్రజల్లో మనోధైర్యాన్ని నింపాలని, వరదల వేళ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం గోదావరి వరదల వేళ సహాయక చర్యలపై ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి వరదలపై జిల్లాలోని అధికారులందరికీ అవగాహన ఉందని, అందువల్ల ముందస్తు యాక్షన్‌ప్లాన్ ఏర్పాటు చేసుకుని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, సహాయం అందించాలని సూచించారు. వరద సహాయం విషయంలో ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

●సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ గోదావరి వరదలతో రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతింటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం, వైద్య సహాయంపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎంతో అనుభవం ఉన్న సీనియర్ అధికారులు ఉన్నారని, గతంలో గోదావరి వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికారులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పక్కా యాక్షన్‌ప్లాన్‌తో సమన్వయంతో వరద సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వరదలు వచ్చినప్పుడే కాకుండా ముందుగానే మోటార్లను తీసుకొచ్చి భద్రాచలం స్లూయిజ్‌ల వద్ద వరద నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఉన్నతాధికారులపై ఆధారపడకుండా అత్యవసర వేళ క్షేత్రస్థాయి అధికారులు నిర్ణయాలు తీసుకుని నష్టం జరగకుండా చూడాలన్నారు. పోలీసుశాఖ అప్రమత్తంగా ఉండి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించి కావాల్సిన ఆహార పదార్థాలను అందించాలన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్, ఐటీడీఏ పీవో యువకులని, గోదావరి వరద సమయంలో సీనియర్ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని పనిచేసి ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు.

●రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వరదలు వచ్చిన సమయంలో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా, పంటలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదలు, విపత్తల సమయంలోనే అధికారులు, ప్రజాప్రతినిధుల సమర్థత బయటపడుతుందన్నారు. వరదలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని కోరారు.

●ఈ సందర్భంగా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వరదలపై ముందస్తుగా చేపట్టబోయే జాగ్రత్త చర్యల గురించి మంత్రులకు వివరించారు. సమావేశంలో కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, వైరా, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావ్, జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

4న ఖమ్మంలో సీపీఐ ఎంఎల్ ఉమ్మడి రాష్ట్ర సదస్సు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 27: కామ్రేడ్ దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో జూలై 4న ఖమ్మంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలోని రెండు విప్లవ పార్టీలు ఒకే వేదికగా రాష్ట్రస్థాయి సదస్సును ఏర్పాటు చేస్తున్నామని ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు,(సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ) కే గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఎస్‌వీ వర్గం) ప్రకటించారు. గురువారం ఖమ్మంలోని టీఎస్టీపీఎస్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 1946 నుంచి 1952వరకు తెలంగాణ ప్రాంతంలో రాజరికం, భూస్వాముల రాజ్యంలో క్రూరత్వం నడిచిందని నాటి చరిత్రను వివరించారు. 50 ఏళ్లుగా అనేక పంథాలుగా పోరాటం చేసిన విప్లవ పార్టీలు ఇప్పుడు ఒకే పార్టీగా ఐక్యం కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా జూలై 4న నిర్వహించే ఉమ్మడి రాష్ట్ర సదస్సులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీలోని రెండు విప్లవ పార్టీలు ఒకే పార్టీగా ఐక్యం జరిగేందుకు ముందుకు అడుగులు పడుతున్నాయని ప్రకటించారు. నాయకులు గౌని ఐలయ్య, పరకాల నాగన్న, ఎం శ్రీనివాస్, ఎం డేవిడ్‌కుమార్, తుపాకుల నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, కొలా లక్ష్మీనారాయణ, వెంకట్‌రామిరెడ్డి, ఐ వెంకన్న, ఎం గిరి, ఖాసీం, సురేశ్, వై ప్రకాష్, వై జానకి, సుభహాన్, సుదర్శన్, ఏ నిర్మల పాల్గొన్నారు.

ఖమ్మంలో నేటినుంచి సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

ఖమ్మం,జూన్27(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్రంలో శుక్రవారం నుంచి సీపీఐ రాష్ట్రస్థాయి కార్యవర్గం కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ప్రారంభమయ్యే ఈ సమావేశాలు ఆదివారంతో ముగియనున్నాయి. 15 ఏళ్ల తర్వాత ఖమ్మంలో జరుగుతున్న ఈ సమావేశాలకు పార్టీ జాతీయ సహాయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా తదితరులు హాజరవుతున్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ, రాష్ట్రస్థాయి సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యచరణ తదితర అంశాలపై చర్చించనున్నారు.

జయహో... 'సీతారామ'!

ఖమ్మం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/అశ్వాపురం: ఉమ్మడి రాష్ట్రంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తుమ్మల నాగేశ్వరరావు దుమ్ముగూడెం నుంచి గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో నీటిపారుదల శాఖ నిపుణుల బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించి సర్వే చేసి దుమ్ముగూడెం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఆ తర్వాత వైఎస్ ప్రభుత్వం దుమ్ముగూడెం, రుద్రంకోట పేరుతో రెండుచోట్ల రెండు ఎత్తి పోతల పథకాలకు రూపకల్పన చేశారు. అయితే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అప్పుడే రూపకల్పన చేయడంతోపాటు, పోలవరం బ్యాక్ వాటర్‌ను రుద్రంకోట ఎత్తిపోతలద్వారా అశ్వారావుపేట, సత్తుపల్లి, పశ్చిమ గోదావరి జిల్లాలోని చింతలపుడి ప్రాంతానికి అందేలా రూపకల్పన చేశారు.

కానీ, రాష్ట్ర విభజన అనంతరం రుద్రంకోట ప్రాంతం పోలవరం ముంపు మండలాల్లో ఆంధ్రాలో విలీనం కావడంతో సాంకేతిక సమస్యలు, విభజన సమస్యలు ఎదురయ్యాయి. దీంతో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రోడ్లు భవనాలశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు దుమ్ముగూడెం ప్రాజెక్టుపై మళ్లీ కసరత్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో దుమ్ముగూడెం ప్రాజెక్టు ఆవశ్యకతను ఖమ్మంజిల్లాలో సాగునీటి సమస్యను వివరించారు. గోదావరి జలాలను పాలేరుకు అనుసంధానం చేయడం ద్వారా కృష్ణా జలాలతో సంబంధం లేకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7.88 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చని సూచించడంతో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పేరుతో రూ.13500 కోట్లతో ప్రాజెక్టు పనులు చేపట్టారు.

మొదటి మూడేళ్లు పనులు వేగంగా జరిగినా ఆ తర్వాత 2018లో మంత్రి తుమ్మల ఓటమి చెందడం, అప్పటి ప్రభుత్వం కాళేశ్వరంపై దృష్టి సారించడంతో సీతారామ పనులు నత్తనడకన సాగాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు తుమ్మల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేటప్పుడే తన చిరకాల స్వప్నం సీతారామ ప్రాజెక్టు అని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీతారామను పూర్తి చేయాలని షరతు పెట్టారు. ఇందుకు కాంగ్రెస్ అధిష్టానం కూడా అంగీకరించి తుమ్మలను కాంగ్రెస్‌లో చేర్చుకుని ఖమ్మం టికెట్ ఇచ్చింది.

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తుమ్మల వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం వచ్చినప్పుడు సీతారామ సాగునీటి ప్రాజెక్టు గురించి తుమ్మల వివరించారు. కొద్ది మొత్తంలో నిధులు కేటాయిస్తే ఈ ఏడాదే గోదావరి జలాలను పారించవచ్చని తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు.ఈ క్రమంలో సీతారామ ప్రాజెక్టు పనులను మంత్రి తుమ్మల ఎప్పకటిప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేయించారు. దీనికి తోడు వైరా రిజర్వాయర్‌కు సీతారామ ద్వారా గోదావరి నీరును అందించేందుకు రూ.72కోట్లు మంజూరు చేయించి లింక్ కెనాల్ పనులు ప్రారంభించారు. దీనికి రాజీవ్ లింక్ కెనాల్‌గా నామకరణం చేయించారు.

ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టితోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి కలిసి పనులు పరిశీలించారు. ఆగస్టు 15 నాటికే వైరా లింక్ కెనాల్ ద్వారా నీరు ఇస్తామని ప్రకటించారు. దీంతో లింక్ కెనాల్ పనులు వేగంగా జరుగు తున్నాయి. ఈ కెనాల్ పూర్తయితే ఈ ఏడాది సీతారామ ఎత్తిపోతల నీరును వైరా రిజర్వాయర్‌కు తరలించి, అక్కడినుంచి లంకాసాగర్, బేతుపల్లికి గోదావరి జలాలు చేర్చనున్నారు. తద్వారా వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సుమారు లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందనుంది. దీంతో సాగర్ ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది. గురువారం అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద ఉన్న ఆరు మోటార్లలో ఒక మోటార్ ప్రారంభించి ట్రయల్ రన్ వేశారు. దీంతో గోదావరిజలాలు పంప్‌హౌస్ నుంచి కాలువలోకి రావడంతో జలకళ కనిపించింది. ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం వద్ద ఉన్న రెండు పంప్‌హౌస్‌లలో కూడా ట్రయల్ రన్ జరిపేందుకు చైనా ఇంజనీర్లను రప్పిస్తున్నారు. పంప్‌హౌస్ మోటార్లను చైనా దేశం నుంచి తెప్పించి ఏర్పాటు చేశారు. కాగా, ఆగస్టు 15లోపే ప్రాజెక్టును సీఎం చేతుల మీదుగా ప్రారంభింప చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

నా ఆకాంక్ష నెరవేరబోతోంది

- ●ఆగస్టు నాటికి మూడు పంప్‌హౌస్‌లు పూర్తి చేయటమే లక్ష్యం
- ●ఈఖరీఫ్‌లోనే సీతారామ ద్వారా లక్షన్నర ఎకరాలకు సాగునీరు
- ●మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీడు భూములకు సాగునీరు అందించాలన్న తన జీవిత, రాజకీయ ఆకాంక్ష త్వరలోనే తీరనుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద గురువారం సీతారామ ప్రాజెక్ట్ మొదటి దశపంప్‌హౌస్ ట్రయల్‌రన్‌ను మంత్రి పరిశీలించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో తుమ్మల ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి జలాలు పంపుహౌస్ నుంచి వస్తున్న దృశ్యం చూసి ఆనందించారు. పుడమితల్లికి గోదావరితల్లికి, సీతారామచంద్రస్వామికి వంగి నమస్కరించారు. ఖ

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం నిధులు విడుదల చేయటంతో విద్యుత్ బిల్లులు చెల్లించి, పెండింగ్ పనులు పూర్తిచేసి సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్‌రన్ నిర్వహించామన్నారు. ఈ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను ఎత్తిపోయటం జరుగుతుందన్నారు.

వచ్చే రెండేళ్లలో ప్రాజెక్ట్ పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మంజిల్లాతో పాటు మహబూబాద్ జిల్లాలోని 10లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషిచేస్తోందని పేర్కొన్నారు. ఆగస్టు నాటికి బీజీ కొత్తూరుతోపాటు, పూసుగూడెం, కమలాపురం లిఫ్టులను పూర్తి చేస్తామన్నారు. ఏన్కూరు లింక్ కెనాల్ కూడా పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలోని చెరువులను గోదావరి జలాలతో నింపే ప్రక్రియను చేపడతామన్నారు.

తన చిరకాల స్వప్నమైన సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో అన్నదాతలు అందించిన సహకారం మరువలేనిదని, భూములు ఇచ్చిన అన్నదాతలకు ట్రయల్‌రన్ సందర్భంగా పాదాభివందనం చేస్తున్నానని పేర్కొన్నారు. అదే విధంగా ఇల్లెందు ప్రాంతానికి కూడా సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏడాదికి రెండులక్షల ఆయకట్టుకు నీరందించే విధంగా రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో ప్రాజెక్ట్ పూర్తయి మొత్తం ఉమ్మడిజిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలో 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, ఇరిగేషన్ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి, సీతఈ శ్రీనివాసరెడ్డి, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

వైరా కేవీకే సత్తా

- రాష్ట్రస్థాయిలో పురస్కారాల పంట

వైరా, జూన్ 27: రైతు సేవలో తరిస్తున్న వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) పురస్కారాల పంట పండింది. వివిధ సేవలకుగానూ తెలంగాణ రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకింగ్ సాధించిన వైరా కేవీకేకు నాలుగు పురస్కారాలు లభించాయి. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ గురువారం రాజమండ్రిలో ఈ పురస్కారాలను అందుకున్నారు. అటవీ జోన్-10 పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని 72 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సమావేశాలు మంగళవారం నుంచి గురువారం వరకు మూడురోజుల పాటు రాజమండ్రిలోని జాతీయ పొగాకు పరిశోధన కేంద్రంలో జరిగాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లోని కృషి విజ్ఞాన కేంద్రాలు 2023-24లో చేసిన కార్యక్రమాల గురించి చర్చించి వాటి పనితీరు, రైతులకు అందించిన సేవలకుగానూ గురువారం పురస్కారాలను ప్రకటించింది. వైరా కేవీకే తెలంగాణ రాష్ట్రంలోని ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలవడమే కాకుండా నాలుగు అవార్డులను సొంతం చేసుకుంది.

ఆదాయ ఉత్పత్తిలో, రైతుల డేటాబేస్‌లో, రైతులు ఎప్పటికప్పుడు వివిధ మాధ్యమాల ద్వారా వాతావరణం, సస్యరక్షణ, నూతన సాంకేతిక వివిధ యాజమాన్య పద్ధతుల గురించి సలహాలు, సూచనలు, నేరుగా వరి విత్తే పద్ధతి గురించి అవగాహన కల్పిస్తూ అధిక విస్తీర్ణంలో రైతులు సాగుచేసేలా తోడ్పాటునందించినందుకుగానూ ఈ నాలుగు అవార్డులు లభించాయి. అటవీ జోన్-10 డైరెక్టర్ షేక్.ఎన్‌మీరా, జాతీయ నూనెగింజల సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే. మాతూరు నుంచి వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ ఈ పురస్కారాలను అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రఘునందన్‌రావు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ వి.సుధారాణి, ఉన్నతాధికారులైన డాక్టర్ ఆర్.ఉమారెడ్డి తోడ్పాటుతోనే ఈ పురస్కారాలు లభించాయని వారికి డాక్టర్ రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జీఎన్‌ఎం పరీక్షలకు 119 మంది హాజరు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 27: జీఎన్ఎం పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. గురువారం రెండో ఏడాది విద్యార్థులు 119 మంది హాజరయినట్లు ఆయన తెలిపారు. పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పది రోజుల పాటు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'ధరణి' సమస్యల పరిష్కారం వేగిరం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 27: జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసినట్లు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం ఆయన తన ఛాంబర్ లో ధరణి దరఖాస్తులను పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రతిరోజు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రోజువారి లక్ష్యం నిర్దేశించుకుని దీనికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు.

పాయం వెంకటేశ్వర్లుకు పలువురి పరామర్శ

- నివాళులర్పించిన మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు
- ఢిల్లీ పిలుపుతో భట్టి పర్యటన రద్దు



నివాళులర్పిస్తు మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు

మణుగూరు/మణుగూరు టౌన్, జూన్ 27: అకస్మాత్తుగా ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మణుగూరు పర్యటన రద్దు అయింది. గురువారం కొత్తగూడెంలో పలుశాఖల అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు మణుగూరు మండలంలో పర్యటించాల్సి ఉంది, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ పెద్ద కర్మ కార్యక్రమాలకు హాజరై ఎమ్మెల్యే పాయంను పరామర్శించి అనంతరం కూనవరం గ్రామంలోని పద్మశ్రీ గ్రహిత సకిని రామచంద్రయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించే షెడ్యూల్ ఉంది. కాగా ఢిల్లీ నుంచి ఫోన్ రావడంతో కొత్తగూడెంలో సమావేశం అనంతరం నేరుగా డిప్యూటీ సీఎం ఢిల్లీ పయనమయ్యారు. హెలీకాప్టర్‌లో రావాల్సిన మంత్రులు రోడ్డు మార్గాన మణుగూరుచేరుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్, ఎమ్మెల్సీ మల్లన్న, బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర నేత బి అయోధ్య, నాయకులు చందాలింగయ్య, ఎడవల్లి కృష్ణ, ముబ్వావిజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, పొడియం బాలరాజు, తదితరులు పాయం మాతృమూర్తి రాములమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుల అర్పించారు. పాయంను కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివాసీ సంఘ నాయకులు రవి, వట్టం నారాయణ కొమరం లక్ష్మణ్ రావు, చందా సంతోష్, కోరం కనకయ్య, పాపారావు, గోపయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాయంను పరామర్శించిన మంత్రి సీతక్క.

మణుగూరుటౌన్: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను మంత్రి సీతక్క గురువారం సాయంత్రం పరామర్శించారు. పాయం మాతృమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పిరినాకి నవీన్, గుడిపూడి కోటేశ్వరరావు, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, వాసు, కృష్ణార్జున్, రమేష్, చందా సతోష్, కోర్సా ఆనంద్, కేవీరావు, పుచ్చకాయల శంకర్, ఆర్‌కే, కొర్సా ఆనంద్ పాల్గొన్నారు.

సకిని కటుంబానికి సీతక్క ఆర్థిక సాయం

పద్మశ్రీ గ్రహిత సకిని రామచంద్రయ్య కుటుంబాన్ని మంత్రి సీతక్క పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలసి గురువారం పరామర్శించారు. రామచంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సకిని కుటుంబ సభ్యులకు తనవంతుకు రూ.25 వేల ఆర్థిక సహాకారాన్ని అందించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేసి చూపిస్తాం..

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

అమలు చేస్తానే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, రాష్ట్ర ఖజానాకు జవాబుదారీగా ఉంటుందన్నారు. రాష్ట్ర సంపదను దోపిడి చేసి ఎవరికి పడితే వారికి పంచి రూ.7లక్షల కోట్ల అప్పు చేసి పారిపోయారని ఆరోపించారు. త్వరలో సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరందిస్తామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిసి కార్పొరేషన్ ఏర్పాటుతోపాటుగా కొత్తగూడెంలో ఐటీహబ్ ఏర్పాటు చేసే ఆలోచనను కూడా పరిశీలిస్తామన్నారు. నిజంగా మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి నీరిస్తే కొత్తగూడెం పట్టణంలో సాగునీటి సరఫరాకు రూ.125కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్నారు. కొత్తగూడెం పట్టణానికి బైపాస్‌రోడ్డుకు, ఆర్‌వోబీకి ఆర్ అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. కొత్తగూడెం నియోజకరవర్గంలో పాల్వంచలోని 800మెగావాట్ల థర్మల్‌పవర్ కర్మాగారాన్ని సూపర్‌క్రిటికల్ టెక్నాలజీతో ప్రారంభించేందుకు పరిశీలన చేస్తామన్నారు. కొత్తగూడెంలో ఐటీహబ్‌ను నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

●సభలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్‌ఫాం సాగు విస్తరణను మరింతగా చేపడతామన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఆయిల్‌ఫామ్ హబ్‌గా తీర్చి దిద్దుతామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అంతా ఎంతో సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో హడ్కో నిధులతో కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి తాగునీరు సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కే సీతారామ ద్వారా గోదావరి నీటిని అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయంలో అధికారులు స్వేచ్ఛాయుతంగా పనిచేయలేకపోయార, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి స్వేచ్ఛగా పని చేయాలని కోరారు. విభిన్న సంస్కృతులు కలిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టర్, ఎస్పీ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ ప్రజాసమస్యలను పరిష్కరించాలని సూచించారు.

● రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీ స్కీంలను అన్నివర్గాల ప్రజలకు అందిస్తోందని, మిగిలిన పథకాలన్నింటినీ త్వరలోనే అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు కోసం రూ.9వేల కోట్లు ఖర్చు చేసినా ఒక ఎకరానికి కూడా నీరివ్వలేకపోయిందన్నారు. తాము త్వరలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి సాగుకు నీరందిస్తామన్నారు. ఈ ప్రాజెక్ట్ ట్రైల్‌రన్ కూడా చేశారని తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

● ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర రహదారుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఇప్పుడిప్పుడే తమ ప్రభుత్వ పాలన పూర్తిస్థాయిలో కొనసాగుతోందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో ఆర్‌అండ్‌బీశాఖమంత్రిగా పని చేసిన తుమ్మల నాగేశ్వరరావు జిల్లాకు సంబంధించిన అన్ని రకాల మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించారన్నారు. మిగిలిన జాతీయ, రాష్ట్ర రహదారులన్ని కూడా జిల్లాలో నిర్మిస్తామన్నారు. ఇప్పటికే కేంద్ర ఉపరితల రవాణాశాఖమంత్రి గడ్కారిని కలిసి రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి కొత్తగూడెం, భద్రాచలం మీదుగా రూ.2,200కోట్లతో జాతీయ రహదారి మంజూరైందన్నారు. త్వరలో దీని పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ఎయిర్‌కండీషన్‌గా చేసేందుకు చొరవ తీసుకుంటానన్నారు. ఉమ్మడి జిల్లాకు ముగ్గురు అనుభవం కలిగిన మంత్రులు ఉన్నారని, తాను ఈ జిల్లాను ఇన్‌చార్జ్ మంత్రి కావడం సంతోషించదగ్గ విషయమన్నారు.

● సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రులకు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం - పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరందించాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం పట్టణంలో ఐటీహబ్‌ను మంజూరు చేయాలన్నారు. కొత్తగూడెంలో రూ.130కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభానికి వచ్చిన మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావ్, జారె ఆదినారాయణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థిని దండించిన మహిళా పీఈటీ

- పాఠశాల ఎదుట తల్లిదండ్రులు, బంధువుల ధర్నా



వాతలను పరిశీలిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

జూలూరుపాడు, జూన్ 27: జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.అరుణకుమారి తీరు వివాదాస్పదమైంది. 6వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న షేక్ సుహాన అనే విద్యార్థినిని అరుణకుమారి కొట్టిందని ఆరోపిస్తూ పాఠశాల ఎదు ట తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. వివరా లు ఇలా వున్నాయి. బుధవారం బ్రేక్ సమయంలో (ఇంటర్వెల్) స్నేహితురాలు పవిత్ర కాలువేలికి రాయి తగలడంతో గాయమయిందని, ఆమెకు కట్టు కట్టించేందుకు సబ్‌ఆర్డినేటర్ వద్దకు వెళ్లి వస్తుండగా వ్యాయామ ఉపాధ్యాయురాలు పిలిచి, నా దగ్గరకు రాకుండా అక్కడకు ఎందుకు వెళ్లారని కర్రతో అరచేతిపై కొట్టడంతో వాతలు పడినట్లు సుహాన తెలిపింది. అయితే అల్లరి చేస్తుండటంతో మందలించానని వ్యా యామ ఉపాధ్యాయురాలు తెలిపారు. కాగా, తమ కూతురిని అకారణంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు కొట్టడంతో అరచేతిపై వాతలు పడ్డాయని, ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట విద్యార్థిని తల్లిదండ్రులు షేక్ మహబూబ్ జాని, ఆస్మా, బంధువులు కలసి ధర్నాకు దిగారు. జరిగిన సంఘటనపై కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. సంఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ దయానంద్ చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్యను వివరణ కోరగా పాఠశాలలో డిజిటల్ తరగతుల శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ ఉన్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుందని తెలిపారు.

టీచర్ కొడుతున్నారని ఫిర్యాదు

దుమ్ముగూడెం: చింతగుప్ప ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న తమ కొడుకు తుర్రం అభిషేక్‌ను టీచర్ బి రాజా అకారణంగా కొడుతు న్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు తుర్రం రాజు, కమల గురువారం ఎంఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో తమ కుమారుడు పాఠశాలకు వెళ్లడానికి భయపడు తున్నాడని పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై ఎంఈవో సమ్మయ్యను ప్రశ్నించగా, ఫిర్యాదు అందిందని విచారణ జరిపి చర్యలు తీసుకుం టామని తెలిపారు.

తప్పతాగి విద్యార్థులను దూషించిన ఉపాధ్యాయుడు

- ● ఆగ్రహంతో నిర్బంధించిన తల్లిదండ్రులు



నిర్బంధంలో ఉన్న ఉపాధ్యాయుడు

ఇల్లెందు టౌన్, జూన్ 27: మద్యం సేవించి విధులకు హాజరైన ఓ ఉపాధ్యాయుడు బాలికలను దూషించడం తో విద్యార్థులు ఆగ్రహించిన తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడిని పాఠశాల తరగతి గదిలో నిర్బందించారు. ఇల్లెందు పట్టణంలోని రెండో వార్డు ఇల్లెందులపాడు లో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇల్లెందులపాడులో గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించే కా ల్వ సుధాకర్ ప్రతిరోజు మద్యం సేవించి విధులకు హాజరౌతున్నాడు. ఇదే క్రమంలోనే గురువారం కూడా ఫూటుగా మద్యం సేవించి విధులకు హాజరు కావడమే గాక ఇద్దరు బాలికలపై అసభ్యకరంగా తిట్ల దండకం అందుకున్నాడు. బాలికలు విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పాఠశాలకు చేరుకుని తరగతిలో నుంచి విద్యార్థుల ను బయటికి తీసుకువచ్చి ఉపాధ్యాయుడిని గదిలోపల నిర్బంధించారు. సమాచారం అందుకున్న ఇల్లెందు ఎంఈవో శ్రీనివాసరావు విచారణ కోసం 21 పిట్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదమ్మను పంపారు. విచారణ చేపట్టి ఉపాధ్యాయుడిపై చర్యలను తీసుకుంటామని తెలపడంతో ఉపాధ్యాయుడిని నిర్బందం నుంచి విడుదల చేశారు.

నూతన కమిషనర్‌ను సన్మానించిన కాంగ్రెస్ కార్పొరేటర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్27: ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అగస్త్యను కాంగ్రెస్ కార్పొరేటర్లు కలిసి సన్మానించారు. గురువారం నూతన కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి వెంకట్రావ్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారి డివిజన్లలో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.





రూ.249కోట్లతో భూగర్భ డ్రెయినేజీ

- ఖమ్మంలో నిర్మాణానికి ప్రణాళికలు
- రెండుప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు
- 21ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు

ఖమ్మంకార్పొరేషన్,జూన్27: ఖమ్మం నగరంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. నగరపాలకసంస్థ పరిధిలో ఖానాపురం ఊర చెరువు నుంచి లకారం చెరువు మీదుగా ధంసలాపురం చెరువు వరకు ఈనిర్మాణం చేపట్టనున్నారు. అమృత్ పథకం కింద రూ.249కోట్లతో మొత్తం 9.5 కిలోమీటర్ల నిడివితో మురుగునీరు వెళ్లేందుకు భూగర్భంలో పైపులైన్లను ఏర్పాటు చేయనున్నారు. తరువాత జోన్‌ల ప్రకారం విభజించి, పలుప్రాంతాల్లోని మురుగు నీరు వెళ్లేలా దీనికి అనుసంధానం చేస్తారు పైపులైన్ల ద్వారా వచ్చిన మురుగును శుద్ధి చేసి ధంసలాపురం చెరువులోకి వదులుతారు. ఖానాపురంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ప్రస్తుతం లకారం వద్ద 1.5 కిలోమీటర్ల నిడివితో ఉన్న డ్రెయినేజీ కాలువ ద్వారా ధంసలాపురం చెరువులోకి వెళుతున్నది. దీంతో ధంసలాపురం చెరువు కలుషితం అవుతున్నది. ప్రస్తుతం చేపట్టనున్న భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం, తరువాత మురుగు నీటిని శుద్ధి చేయటం వల్ల ఇక కలుషితం కాదు. సదరు చెరువు కలుషితం కావటం వల్ల చేపలు చనిపోతున్నాయంటే అక్కడి నీరు ఎంత విషపూరితంగా తయారవుతోందో అర్థం చేసుకోవచ్చు. భూగర్భ డ్రెయినేజీ నిర్మాణంతో ఇక ఈసమస్యకు శాశ్వతంగా చెక్ పడనుండి.

మురుగునీటి శుద్ధికి రెండు

భూగర్భ డ్రెయినేజీ ద్వారావచ్చిన మురుగునీటిని శుభ్రపరిచేందుకు రెండు మురుగునీటి శుద్ధిప్లాంట్లను నిర్మించనున్నారు. ధంసలాపురం చెరువువద్ద నిత్యం 44మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఒక ప్లాంటును, పుట్టకోట చెరువు వద్ద రోజుకు 9.5 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసేందుకు మరో ప్లాంటును నిర్మించనున్నారు. శుద్ధి చేసిన అనంతరం ధంసలాపురం చెరువుకు మళ్లిస్తారు. కాగా భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే ఇప్పటివరకు లకారం వద్ద నున్న డ్రెయినేజీ కాలువ ద్వారా మురుగునీరు బదులు వర్షపునీరు ప్రవహిస్తుంది. భూగర్భ డ్రెయినేజీలో మురుగునీరు, వర్షపు నీరు వెళ్లేందుకు వేరువేరుగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో మురుగునీరు నిండి వర్షం పడితే మురుగు, వర్షంనీరు కలిసి రహదారలుపై ప్రవహిస్తోంది. భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే మురుగు నీరు ఎప్పటికప్పుడు భూగర్భ డ్రెయినేజీ పైప్‌లైన్ల ద్వారా మురుగు శుద్ధి ప్లాంట్లకు చేరటంతో కాలువలు శుభ్రంగా ఉంటాయి. వర్షం పడినా, సదరు నీరు డ్రెయినేజీ కాలువల్లోకి వెళ్లి వరదనీరు రహదారులపైకి రాదు.



21ఎకరాల భూసేకరణకు కలెక్టర్ దృష్టికి

మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి మొత్తం 21 ఎకరాల భూమి అవసరం అవుతుందని నగర పాలకసంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనా వేశారు. సదరు భూమి సేకరణ నిమిత్తం నగర పాలకసంస్థ కమిషనర్, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. త్వరలోనే అధికారులు సేకరించవలసిన భూమిని పరిశీలిస్తారు. భూసేకరణ విషయం రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నారు. త్వరలోనే భూగర్భ డ్రెయినేజీ నిర్మాణ పనులు, మురుగుశుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి స్థల సేకరణ పనులు వేగవంతం కానున్నాయి. ఇప్పటికే నగర పాలకసంస్థ ఎస్ఈ రంజిత్,నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యనుకలిసి డ్రెయినేజీ నిర్మాణానికి సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను అందించారు.

← భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం మ్యాప్

కలుపు తొలగించాకే ఎరువులు వేయాలి

- డీఏవో విజయనిర్మల

కొణిజర్ల,జూన్27: పత్తిని సాగు చేసిన రైతులు కలుపు మొక్కలను తొలగించాకే ఎరువులు వేసుకోవాలని, కలుపు మొక్కలను అలాగే ఉంచి ఎరువులు వేయడం వలన ఎరువంతా కూడ కలుపుమొక్కలకే పడుతుందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల రైతులకు సూచించారు. గురువారం ఆమె మండలంలోని సింగరాయపాలెం, కొణిజర్ల, తీగలబంజర, తనికెళ్ళ గ్రామాలలో పత్తి, పెసర, పచ్చిరొట్టను పరిశీలించారు. సింగరాయపాలెంలో రైతులు వేసిన పచ్చిరొట్ట విత్తనాలు మొలిచిన విధానాన్ని పరిశీలించారు. పచ్చిరొట్టను భూమిలో వేసి దున్నటం వలన పెట్టుబడులు తగ్గుతాయని, మందుల వాడకం తగ్గుతుందని తెలిపారు. అనంతరం తీగలబంజరలో ఆయిల్‌ఫామ్‌లో వేసిన పెసరపంటను పరిశీలించారు. కొణిజర్లలో పత్తిసాగును పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. తనికెళ్ళ క్రాప్‌బుకింగ్ స్పెషల్‌డ్రైవ్ ఎలా చేస్తున్నారని ఏఈవో శ్రీనివాస్‌రాజును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలాజీ, రైతులు పాల్గొన్నారు.


పచ్చిరొట్టను పరిశీలిస్తున్న డీఏవో విజయనిర్మల

పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

- నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంకార్పొరేషన్, జూన్27: పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణపై గురువారం కమిషనర్, సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. నగరపాలకసంస్థకు చెందిన ట్రాక్టర్ల పరిస్థితి గురించి అడిగారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, జవాన్లు సమన్వయంతో పని చేయాలన్నారు. అలాగే ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని, ఏఏ డివిజన్లలో ఎప్పుడు చేస్తున్నారో నమోదు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత వారిదేనని పేర్కొన్నారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి, ఎంతమంది సిబ్బంది, ఏయే విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దృష్టి సారించాలి: అలుగుబెల్లి

బోనకల్, జూన్ 27: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని జానకిపురం, రావినూతల, బోనకల్ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ చావా దుర్గాభవానీ, జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి వల్లంకొండ రాంబాబు, మండల కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, నాగేందర్, మురళీ, వీరబాబు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల శిక్షణ పరిశీలిన

కల్లూరు, జూన్27: గురుకుల విద్యాలయంలో జరుగుతున్న అంగన్వాడీల శిక్షణ కార్యక్రమాన్ని ఎస్జీవో రాష్ట్రఫెసీలిటేటర్ భావన సందర్శించి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా ద్వారా పిల్లలకు సులభమైన విధానంలో ఆట, పాటల ద్వార విద్యను అందించే కార్యక్రమంపై ఐసీడీఎస్ ద్వారా ప్రత్యేకంగా టీచర్లకు దశల వారిగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో భావన తోపాటుగా మాస్టర్ ట్రైనర్ సుజాత అవగాహన కల్పించారు. నూతన విద్య బోధన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మోహరున్నీసా బేగం, ఏసీడీపీఓ మహబుబ్అలీ, సూపర్వైజర్లు భవానీ, మధులత, హబీబున్నీసాబేగం, మహాలక్ష్మి, విజయలక్ష్మి బ్లాక్ కోఆర్డినేటర్ హరీష్ పాల్గొన్నారు.

రైతుల్లో విశ్వాసం పెంచిన మంత్రి తుమ్మల

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



సత్తుపల్లి,జూన్ 27: సీతారామా ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు మళ్లిచేందుకు గాను జరుగుతున్న పనుల్లో గురువారం జరిగిన ట్రయల్ రన్ విజయవంతమైందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని భూములకు మళ్లించేందుకు గానూ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషి ఫలిస్తోందని అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ట్రయల్‌రన్ విజయవంతంతో జిల్లాలోని రైతులలో మంత్రి తుమ్మల విశ్వాసం పెంచారని అన్నారు. తుమ్మల కృషితో ప్రస్తుత పంటకాలంలోని వైరా రిజర్వాయర్‌కు, లంకాసాగర్ మధ్యతరహా ప్రాజెక్టులు సహా మధ్యలో ఉన్న చిన్నతరహా నీటివనరులకు గోదావరి జలాలు మళ్లించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఈ క్రమంలో మెయిన్ కెనాల్‌లో ఉన్న స్ట్రక్చర్లు అన్ని పూర్తిచేయించేందుకు మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామా ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేయడంతో పాటు నిధులు అన్నింటినీ కాళేశ్వరం ప్రాజెక్టుకు ఖర్చుచేశారని, దీనివలన గత నాలుగేళ్ల కాలంలో పనులు పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు మంత్రి తుమ్మల కృషి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల సహకారంతో సీతారామ ప్రాజెక్టు త్వరలో పూర్తిఅయి సాగునీరు అందుతుందనే విశ్వాసం, నమ్మకం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలలో కలిగిందన్నారు.

అదృశ్యమైన మహిళ మృతి

ఖమ్మంక్రైం, జూన్27: గతనెల అదృశ్యమైన మహిళ మృతి చెందింది. నగరంలోని టేకులపల్లి డబల్ బెడ్‌రూమ్‌లో నివసిస్తున్న రాజేశ్వరి(34) మతిస్థిమితం సరిగాలేదు. నెల రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లింది. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో కొద్దిరోజుల తర్వాత కుటుంబ సభ్యులు అర్బన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కాగా గురువారం సాయంత్రం నగర శివారులోని వెలుగుమట్ల పార్కు సమీపంలో గుర్తుతెలియని స్థితిలో ఓ మహిళ అస్తిపంజరం ఉన్నట్లు స్థానికులు అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. అస్తిపంజరంపై ఉన్న దుస్తుల ఆధారంగా మృతదేహాన్ని గుర్తించారు.

చికిత్స పొందుతూ మృతి

పెనుబల్లి,జూన్27: అనారోగ్య సమస్యలతో బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... మండలంలోని మండాలపాడు గ్రామానికి చెందిన గుర్రం రమేష్(27) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధప డుతున్నాడు. తట్టుకోలేక బుధవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అతడిని పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

కామేపల్లి, జూన్27: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని ఊట్కూర్‌కు చెందిన గొర్రెపాటి వాసు(45) కుటుంబంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన వాసు గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

గుడిపూడి కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ

సత్తుపల్లి,జూన్ 27: సత్తుపల్లి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపూడి దుర్గారావు ఇటీవల మృతి చెందటం తెలిసిందే.. కాగా ఆయన కుటుంబ సభ్యులను వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఎన్టీఆర్ జిల్లా మండలం కోదూరులో ఆయన ఇంటికి వెళ్లి దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మదర్ థెరిస్సా విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాం డెంట్ చలసాని సాంబశివరావు, ఆలపాటి రామచంద్ర ప్రసాద్,బోడెంపూడి బాలయ్య, దారపునేని నారాయణరావు ఉన్నారు.


దుర్గారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తుమ్మల

ప్రతిభావంతులకు పురస్కారాలు

వైరా, జూన్ 27: వైరా మండలంలో మార్చిలో జరిగిన పదోతరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు స్థానిక వ్యాపార సముదాయం వారు గురువారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆ విద్యార్థులకు అవార్డులు, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సన్మానించారు.

అన్నదాన కార్యక్రమం

కల్లూరు, జూన్ 27 కల్లూరులోని శ్రీషీరిడిసాయిరామా. ధాన్య మందిరంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అన్నదాత సుధీర్‌రెడ్డిని శాలువతో సత్కరిచి బాబా మెమొంటోను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు కె బలారం, బావాజీ, జి శ్రీనువాసరావు, బోగ్గవరపు మురళి పాల్గొన్నారు.

పోలీసుశాఖలో పలువురికి ఉద్యోగోన్నతి

ఖమ్మం క్రైం జూన్27: ఉమ్మడి జిల్లాలో పోలీసుశాఖలో పలువురికి ఉద్యోగోన్నతి కలిగింది. భద్రాద్రి కొత్తగూడెంలో హెడ్ కానిస్టేబుళ్లగా విధులు నిర్వహిస్తున్న జి. హేమచందర్‌రావు, జి.రఘురాములు, పి.వరప్రసాద రావు, ఖమ్మంలో హెడ్‌కానిస్టేబుల్‌గా ఉన్న సీహెచ్ శ్రీనివాస్, కె.రాఘవులు, ఇంటిలిజెన్సీలో ఉన్న ఎం.సురేష్‌బాబు సీఐడీలో ఉన్న సీహెచ్‌రత్నంను ఏఎస్ఐలుగా ఉద్యో గోన్నతి కల్పించి భద్రాద్రి జిల్లాకు కేటాయించారు. పి.శ్రీనివాసరావు ఎం..హనుమంతు, అబ్దుల్ మజీద్‌ను మహబాద్ జిల్లాకు ఏఎస్ఐలుగా, సీఐడీలో ఉన్న ఎస్. సుజాతను ఖమ్మం కమిషనరేట్‌కు ఏఎస్ఐలుగా కేటాయించారు. ఖమ్మంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి.కొండలరాజు, ఏ.నాగేశ్వరరావు,బి.లక్ష్మీపతిను హెడ్‌కానిస్టేబుళ్లగా భద్రాద్రి జిల్లాకు బదిలీ చేశారు. డి.శ్రీనివాస్, వై. రాములును మహబాద్‌జిల్లాకు హెడ్ కానిస్టేబుళ్లగా, సీహెచ్ రాంబాబును భద్రాద్రిజిల్లా హెడ్‌కానిస్టేబుల్‌గా కేటాయించారు.

కోనేరులో చేపలు పెంచొద్దు'

ఫిషరీస్ అధికారులకు దిద్దుపూడి వాసుల ఫిర్యాదు

వేంసూరు, జూన్27: మండల పరిధిలోని దిద్దుపూడి గ్రామంలో ఉన్న కోనేరులో మత్స్య సొసైటీ వారు చేపలు పెంచొద్దని గ్రామస్థులు ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ రాజు, ఫిషరీస్ శాఖ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. కోనేరులో చేపలకు వేసే ఆహారం కారణంగా సమీప పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులతోపాటు ప్రజలు తీవ్ర దుర్గంధాన్ని భరించలేకపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామం నడిబొడ్డులో చేపల పెంపకం వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. కోనేరులో చేపల పెంపకాన్ని నిషేధించాలని అధికారులను కోరారు. దీంతో స్పందించిన పిషరీస్ అధికారులు గురువారం గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. కోనేరులో చేపల పెంపకాన్ని నిషేధించాలంటూ అధికారులను నిలదీశారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. చేసేదేమీ లేక ఫిషరీస్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వ్యక్తి మృతి అనుమానాస్పదం

ఖమ్మంక్రైం,జూన్27: అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన కొడారి అప్పారావు(40) పదేళ్ల క్రితం ఖమ్మానికి చెందిన రేణుకను వివాహం చేసుకున్నాడు. కొంతకాలం నగరంలోని త్రీటౌన్‌లో సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్నారు. మిర్చిమార్కెట్ లోకూలీగా పనిచేస్తున్నాడు. ఇటీవల భార్యతో గొడవ కావడంతో రేణుక పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో అప్పారావు ఇంటిలో బుధవారం అర్ధరాత్రి సమయంలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచారు. అక్కడ కుళ్లిపోయిన స్థితిలో ఉన్న అప్పారావు మృతదేహాన్ని గుర్తించారు. అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

అధిక మోతాదులో మాత్రలు మింగి వ్యక్తి ఆత్మహత్య

చింతకాని, జూన్ 27: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పందిళ్లపల్లి గ్రామానికి చెందిన ఉరిమిళ రామ్మోహనచారి (39) మతిస్థిమితం లేదు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో గాంధీనగర్ గ్రామానికి చెందిన సోదరి లక్ష్మి వద్ద కొంతకాలంగా ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న మాత్రలు అధిక మోతాదులో మింగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన వారు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోదరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

సినీ గెలాక్సీ మినీ థియేటర్‌ను ప్రారంభించిన ఎర్నేని

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్27: నగరంలోని మమత హాస్పిటల్‌రోడ్‌లోని ఈఆర్ఆర్ రిసార్ట్స్‌లో సీఎన్ సినీ గెలాక్సీ మినీ డోమ్ థియేటర్‌ను ఈఆర్ఆర్ రిసార్ట్స్, స్తంభాద్రి బ్యాంక్‌ఛైర్మన్ ఎర్నేని రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అతిథిగా చెరుకూరి కృష్ణమూర్తి హాజరై మొదటి టికెట్ కొనుగోలు చేశారు. ఎర్నేని రామారావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విలాసంతమైన థియేటర్‌ను ఖమ్మంలో తీసుకురావడం చాలా గొప్ప విషయమని నిర్వాహకులైన గన్నవరపు చంద్రశేఖర్ నాగపవనులను అభినందించారు. గన్నవరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ పూర్తి ఎయిర్ కండిషన్, అత్యాధునిక ఆడియో వీడియో సదుపాయాలతో 100 సీటింగ్ కెపాసిటీతో ఈ థియేటర్ నిర్మించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొదుమూరి నాగ పవన్, కార్పోరేటర్ మిక్కిలినేని నరేంద్ర, సీనియర్ అడ్వకేట్ నిరంజన్ రెడ్డి, కొదుమూరు రవి, సమీర్, లక్ష్మణ్ ,తెల్లాకుల వెంకటేశ్వర్లు,వసంత పటేల్ పాల్గొన్నారు.


థియేటర్‌ను ప్రారంభిస్తున్న రామారావు

విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించాలి

ఖమ్మంలీగల్ జూన్ 27: కరెంట్ బిల్లు కట్టినప్పటికీ వారి కరెంట్‌ను తీసివేయడంతో వారి మనోవేదనకు నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఛైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత తీర్పునిచ్చారు. ఖమ్మంలోని దోరేపల్లి పుల్లయ్యనగర్‌కు చెందిన కైలాసపు ఉపేంద్రమ్మ, కమలమ్మ 2014లో ఇంటి కరెంట్ బిల్లు చెల్లించినప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. కరెంట్ ఆఫీసుకు వెళ్లి అధికారులకు చెప్పినప్పటికీ వారు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. దీంతో ఖమ్మం వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు నివేదించారు. కేసును పరిశీలించిన కమిషన్ విద్యుత్ అధికారులు ఫిర్యాది దారులకు నష్టపరిహారం కింద ఇద్దరికి రూ.15వేలు చొప్పున చెల్లించమని, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.5వేలు చెల్లించాలని, విద్యుత్ సర్వీసును పునరుద్ధరించాలని తీర్పునిచ్చారు.

తిరుమలాయపాలెంలో చైన్‌స్నాచింగ్

తిరుమలాయపాలెం, జూన్27: ద్విచక్ర వాహనంపై వచ్చిన దొంగలు బంగారు ఆభరణాలు చోరీ చచేశారు. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొండబాల బాబురావు తన పామాయిల్ తోటకు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి కత్తులు, కర్రలతో బెదిరించి అతడి మెడపై ఉన్న రెండున్నరతులాల బంగారం చైన్, చేతికి ఉన్న అరతులం ఉంగరం ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం

- ఎక్సైజ్ స్టేషన్‌లో విధుల విషయంపై గొడవ

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్27: ఎక్సైజ్‌శాఖలో విధుల విషయంలో జరిగిన గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్2 పరిధిలోని తిరుమలాయపాలెంలో పర్యవేక్షణకు బుధవారం సాయంత్రంసీఐ చంద్రమోహన్ ఎస్ఐతో పాటుగా హెడ్ కానిస్టేబుల్, మరికొంతమంది కానిస్టేబుల్స్‌కు విధులు కేటాయించారు. కాగా హెడ్ కానిస్టేబుల్ వాహనంలోకి రాలేదు. తప్పనిసరిగా ఉండాలని సీఐ ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం తిరుమలాయపాలెం మండలంలో తనిఖీలకు వెళ్లారు. ఈ క్రమంలో ఎస్ఐకు హెడ్‌కానిస్టేబుల్‌కు మధ్య వాహనంలో గొడవ జరిగింది. తిరిగి రాత్రికి ఎక్సైజ్‌స్టేషన్‌కు చేరుకున్న తర్వాత మరోసారి సీఐ సమక్షంలోనే ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. హెడ్‌కానిస్టేబుల్ తనను దూషించాడని ఆగ్రహం చెందిన ఎస్ఐ.. కానిస్టేబుల్ చెంపపై కొట్టినట్లు తెలిసింది. తర్వాత గొడవ విషయాన్ని ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఇరువురు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం హెడ్ కానిస్టేబుల్ సంఘం నాయకులను, రాజకీయ పార్టీల తీసుకురాగా, ఎస్ఐ కుటుంబ సభ్యులను తీసుకొచ్చారు. పంచాయతీ నిర్వహించారు. మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు పట్టించు కోలేదు. సరికదా విచారణ కూడా చేపట్ట లేదు.

పూడికతీత పనుల పరిశీలన

ఖమ్మంకార్పొరేషన్, జూన్27: నగరంలోని 41వ డివిజన్‌లో మేజర్ నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ఏఈ నవ్యజ్యోతి గురువారం పరిశీలించారు. మేజర్ నాలాలో తూటుకాడలు పెరిగి, మురుగు నిల్వ ఉండి, వర్షం కురిస్తే మురుగుమొత్తం పరిసర ప్రాంతాల్లోని నివాసాల్లోకి వస్తున్నది. ఈ సమస్యను కార్పొరేటర్ కర్నాటికృష్ణ, మేయర్, కమిషనర్‌ల దృష్టికి తేవటంతో వారు నాలా పూడికతీతకు పురమాయించారు.

త్వరలోనే ప్రజలకు అందుబాటులో సారథీ నగర్ ఆర్‌యూబీ

ఖమ్మంకార్పొరేషన్, జూన్27: నగర పాలక సంస్థ సాధారణ నిధులు రూ.70లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సారధినగర్ అండర్ రైల్వే బ్రిడ్జిని (ఆర్‌యూబీ) త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం మేయర్ ఆర్‌యూబీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, మాజీ కార్పొరేటర్ నాగండ్ల దీపక్‌చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి

మేజర్ మెడకంటి కిషోర్‌రెడ్డి

ఖమ్మంరూరల్,జూన్27: విద్యార్థులు చదువుపై ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని మేజర్ మెడకంటి కిషోర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోల్లగూడెం ఆశ్రమపాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల అదనపు విజ్ఞానం కోసం రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, హెచ్‌డబ్ల్యూవో రమా కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు న్యాయవాదులకు కొత్త చట్టాలపై తరగతులు

ఖమ్మంలీగల్, జూన్27: ఐఏఎల్‌లు ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఖమ్మం నగరం గట్టయ్య సెంటర్‌లో ఉన్న డీపీఆర్‌సీ బిల్డింగ్‌లో న్యాయవాదులకు కేంద్రప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలపైన తరగతులను నిర్వహిస్తామని ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావులు తెలిపారు. ఈ తరగతులను బోధించటానికి వరంగల్ సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

స్నేహితుడి వైద్యానికి పూర్వవిద్యార్థుల సహాయం

తల్లాడ,జూన్27: అనారోగ్యానికి గురైన స్నేహితుడి వైద్యానికి పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన జి.వెంకట్ అనారోగ్యానికి గురయ్యాడు. అతనితోపాటు తల్లాడలోని జడ్పీఉన్నత పాఠశాలలో 1991-92పదోతరగతి చదివిన విద్యార్థులు రూ.51,500గురువారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కేవీ. కృష్ణారావు, చింతల కృష్ణ, సరికొండ అప్పల రాజు, షేక్. అక్బర్, రహీం, మిట్టపల్లి నర్సింహారావు, కృష్ణకుమారి, కళావతి, అనిత పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న స్నేహితులు